

నాడు సై అన్నారు.. నేడు నై అంటున్నారు...

పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు న్యాయమైన కోర్కెల కోసం వైసిపి అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి వారు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తెలిపి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హిందూపురంలో జరిగిన ఆందోళన కార్యక్రమాలకు సినీ నటులు, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలపై జై కొట్టిన కూటమి... అధికారంలోకి వచ్చిన అనంతరం నేడు నై అంటోంది. దీంతో పురపాలక సంఘాల్లో పని చేస్తున్న కార్మికులందరు సమ్మెకు సిద్ధమయ్యారు.

ప్రజాశక్తి హిందూపురం

2024లో మరో మూడు నెలల్లో ఎన్నికల వస్తుందన్న సమయంలో పురపాలక సంఘాల్లో విధులు నిర్వహించే కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సమ్మెలోకి వెళ్లారు. ఎన్నికల నేపథ్యంలో కార్మికులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు టిడిపి పరోక్షంగా సహకరాలు అందించడంతో పాటు సమ్మె చేస్తున్న దీక్షా శిబిరాలకు వద్దకు వెళ్లి సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చించి, డిమాండ్లలో కొన్నింటిని పరిష్కరిస్తామని చెప్పడంతో పాటు దీనిపై జీవో సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడంతో కార్మికులు తాము చేస్తున్న ఆందోళన కార్యక్రమాలను విరమించారు. 2024 సంవత్సరంలో కార్మికులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతు పలకిన కూటమి ఆ సందర్భంలో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. దీంతో కార్మికులందరు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారు. అయితే హామీలపై హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికుల ఆశలపై నీళు చెల్లింది. ఒక్క పురపాలక సంఘాల్లో పని చేస్తున్న కార్మికులే కాకుండా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులపై కొరఢా ఝులిపించింది. గత ప్రభుత్వం కార్మికుల భద్రత కోసం తీసుకోచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేసి, పొరుగు సేవలను ఏజెన్సీలకు అప్పగించే యోచనతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఆయా ప్రభుత్వ శాఖల్లో ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగుల విరమణ తరువాత కొత్తగా పోస్టింగ్‌లు ఇవ్వడం మానేశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల పేరుతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ అతితక్కువ వేతనాలు ఇస్తున్నాయి. కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. వీరు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి కుటుంబ అవసరాల కోసం కష్టపడి పనిచేస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 1100, అనంతపురం జిల్లాలో 3000 మంది వరకు కార్మికులు ఆప్కాస్ కార్పొరేషన్ నుంచి వేతనాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి..



పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు ఇచ్చిన బాలయ్యకు వినతిని ఇస్తున్న కార్మికులు (ఫైల్ ఫోటో)

- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ ఏమైంది..?
- పొరుగు సేవలను ఏజెన్సీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం
- సమ్మెకు సిద్ధమంటున్న మున్సిపల్ కార్మికులు



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసనదీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మికులను మోసం చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం..!

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిని పక్కన పెట్టి అసలకే మోసం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదు. కనీసం రూ.27 వేలు ఇవ్వాలని ప్రభుత్వ సిఫార్సు ఉంది. దీనిని అమలు చేయమని మాత్రమే కార్మికులు అడుగుతున్నారు. హిందూపురం పురపాలక సంఘంతో పాటు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిరాతో పాటు అనంతపురం నగరంతో పాటు అనేక మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులు తెల్లవారు జామున 5 గంటలకే విధుల్లో కనిపిస్తున్నారు. వీధులు చిమ్మడం, డ్రెయినేజీ పూడికలు తీయడం, ఇలా అన్ని పనుల్లో ఉంటున్నారు. వీరికి కనీస వేతనం కూడా అందడం లేదు. పనిచేస్తూ అప్పులు తెచ్చుకొని, వడ్డీలు కడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర ధరలు భారీగా పెరిగిపోయాయి. విద్య, వైద్యం ఖరీదైంది. శారీరక కష్టం పడుతోన్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదు. ఇదే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులున్నారు. వీరి పరిస్థితి అలానే ఉంది. ఆప్కాస్ కార్పొరేషన్ ద్వారానైనా పూర్తి వేతనం చేతికొచ్చి, పిఎఫ్, ఇఎస్ఐ, జిఎస్‌టి చెల్లిస్తోన్న సమయంలో ప్రభుత్వం ఏజెన్సీలకు లింకుపెట్టడాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డియాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెకు సిద్ధమని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం



పురపాలక సంఘాల్లో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని. లేని పక్షంలో ఏ క్షణంలోనైనా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తాం.. కూటమి ప్రతి పక్షంలో ఉన్న సమయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉద్యమిస్తే, ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి, జనసేన నాయకులు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా దీక్షా శిబిరాలకు వచ్చి మద్దతు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తి విఫలమయ్యారు. కార్మికులు విధులు నిర్వహించాలంటే వారికి పనిముట్లు చాలా ముఖ్యం. అలాంటి పనిముట్లను ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. వెంటనే కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు, ఏకరూప దుస్తులు, చెప్పులు, కొబ్బరినూనె వెంటనే ఇవ్వాలి. వీటితోపాటు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.. లేనిపక్షంలో ఏ క్షణంలోనైనా విధులను బహిష్కరించి మెరుపు సమ్మెలోకి వెళ్తాం.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

10న మెగా పిటిఎం-2.0ను జయప్రదం చేద్దాం

కలెక్టర్ వి.వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (మెగా పిటిఎం) 2.0ను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో డిఇఒ. ఎం.ప్రసాద్‌బాబు, డివిఇఒ. వెంకటరమణ నాయక్, ఎపిసి శైలజతో కలిసి కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు విద్యా సంస్థల్లో మెగా పిటిఎం-2.0ను ఆదర్శవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా మెగా పిటిఎం-2.0ను అమలు చేస్తున్నారని తెలిపారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ విద్యా సంస్థలు కెజిబివి, మోడల్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, చెందిన 2511 విద్యా సంస్థల్లో నిర్వహించే మెగా పిటిఎం 2.0కు 4,37,777 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పిల్లల చదువులో తల్లి యొక్క పాత్ర పై పోటీలు నిర్వహిస్తామని, వారికి బహుమతులు అందిస్తామని అన్నారు. ఇప్పటికే జిల్లాలో సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు జిల్లాకు 36,62,563 వస్తువులు రావడం జరిగిందని, మరో 4,240 వస్తువులు 48 గంటలలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దాంతో పాటు తల్లికి వందనం పథకాన్ని కూడా అమలు చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2.32 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ బడిలో చదువుతున్నారని, వారితో పాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. ప్రభుత్వ బడికి పిల్లలను పంపించేటప్పుడు మొత్తం ప్రభుత్వం, టీచర్ చూసుకోవాలి కాదని, అందరి భాగస్వామ్యం పిల్లల భవిష్యత్తులో ఉండాలనేది ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ పాల్గొంటారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం భోజనం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనాన్ని కూడా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ - మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం కింద మొక్కను నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో మంత్రి, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొహం చాటేసిన వర్షం

దుక్కులు చేసుకుని రైతన్నల ఎదురుచూపు



సాగుకు సిద్ధంగా ఉన్న భూమి

ప్రజాశక్తి-యల్లనూరు

ఖరీఫ్ సీజన్‌లో రైతులు దుక్కులు చేసుకుని వరుణ కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. జూలై నెల వచ్చినా వర్షాలు కురవకపోవడంతో అన్నదాతల్లో సాగుపై ఆందోళన మొదలైంది. గత ఖరీఫ్ సీజన్‌లో యల్లనూరు మండలంలో 25వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. అయితే ఈసారి కనీసం ఎకరా కూడా సాగుకు నోచుకోకపోవడం విశేషం. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేసవి దుక్కులు చేసుకోవడంతోపాటు విత్తనాలను సిద్ధం చేసుకుని విత్తేందుకు వర్షం కోసం ఆకాశం వైపు చూడాల్సి వస్తోంది. జూలై వచ్చినా వర్షం జాడ కనపడకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు వర్షాధారంపైనే ఆధారపడ్డారు. ఈనేపథ్యంలో వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న అన్నదాతలకు దిక్కుతోచని పరిస్థితి. ఏదిఏమైనా సాగుకు అన్నీ సిద్ధం చేసుకున్న రైతులు వర్షం కురవాలని కోరుతున్నారు.

కలుషిత నీటి ఘటనపై విచారణ



నీటిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుంతకల్లు

నగరంలోని తిలక్‌నగర్ 11వ వార్డులో మున్సిపల్ నీరుతాగి పదిమంది అస్వస్థతకు గురైన ఘటనపై ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయమే కాలనీలో పర్యటించిన ఆయన కొళాయి నీటి నాణ్యతను పరిశీలించి నమూనా సేకరించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులను పరామర్శించి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ నయీమ్ అహ్మద్, ఎంఇ ఇంతియాజ్‌అలీ, డిఇ షబానా, ఎఇ సుదర్శన్‌తో నీటి సరఫరా,నాణ్యతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాలనీలోని కొంతమంది మున్సిపాలిటీ నీరు తాగామని, మరి కొంతమంది ప్రయివేటు వాటర్ ప్లాంట్‌లోని నీళ్లు తాగామని చెబుతున్నారన్నారు. ఫుడ్ పాయిజన్, డి-ఆర్డినేషన్ వల్ల కూడా ఇలా జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయినా నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామని, మూడు రోజుల తర్వాత వచ్చే నివేదికను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సమ్మర్ స్టోరేజి ట్యాంకును పరిశీలించి నీటిని శుద్ధిచేయడంలో నిర్లక్ష్యం చేయరాదని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.ఆదినారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కేతన్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా గూగూడు కుళ్లాయిస్వామి పెద్దసరిగెత్తు



గూగూడు కుళ్లాయిస్వామికి పొర్లుదండాలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెద్ద సరిగెత్తు వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంఆ ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో గూగూడుకు చేరకున్నారు. అనంతరం కుళ్లాయిస్వామికి నైవేద్యం చేసి సమర్పించారు.కోర్కెలు తీరిన పలువురు భక్తులు కుళ్లాయిస్వామి అగ్నిగుండం చుట్టూ పొర్లుదండాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు అగ్నిగుండ ప్రవేశం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం ఉంటుంది. ఈ వేడుకను తిలకించడానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. నేడు సాయంత్రం కుళ్లాయిస్వామి జలధికి తరలివెళ్తారు. బుధవారం సాయంత్రం కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయి.

కుళ్లాయిస్వామి దర్శించుకున్న ఎంఎస్ రాజు

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గూగూడులో కుళ్లాయిస్వామితోపాటు ఆంజనేయ స్వామిని మడకశిర ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు తన కుమారుడు సందేశ్ మోక్షోజ్ఞతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలనాగి నరేష్, రమేష్ మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు జాఫర్ వలి, రాజన్న, ఓబులేసు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే వెంకట్ వకుళా ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిలను దర్శించుకున్నారు. ఆయా స్వాముల ఆశీస్సులుతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

గూగూడుకు 65 ప్రత్యేక బస్సులు

అనంతపురం : నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం 65 బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం నుంచి నార్పల మీదుగా గూగుడుకు ప్రత్యేక బస్సులు తిప్పుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా సోమవారం కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం, జలధి పోవుట కార్యక్రమాలు ఉండటంతో 75 బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్ థామస్ మన్రోకు నివాళి

గుత్తి : దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో 198వ వర్ధంతి వేడుకలు గుత్తిలో ఆదివారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గుత్తి కోట వద్ద ఉన్న ఆయన సమాధి వద్ద నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు ఎన్.సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

రేపు రెండువేల ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం

ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి ఎన్. సలీంబాషా





సలీంబాషా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈనెల ఎనిమిదవ తేదీన జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు రెండు వేల ఎకరాల్లో ఉద్యానవన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి ఎన్.సలీంబాషా తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ముందస్తు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసామని వివరించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి ఆయన వివరించారు.

ప్రశ్న : ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద నిధులెంత మేరకు మంజూరయ్యాయి ?

జవాబు : ఈ ఏడాది 96 లక్షల పని దినాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ , మే, జూన్ మూడు మాసాల్లోనే 55.18 లక్షల పనిదినాలు ఇప్పటికే పూర్తి చేశాం. ఇంకా ఈ ఏడాదిలో 35 లక్షల పనిదినాలు చేయాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ఉన్నందున ఇప్పుడు ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య కొంత తగ్గింది. ఇక ఈ ఏడాది అనంతపురం జిల్లాకు రూ.281 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో రూ.154 కోట్లు వేతనాల కోసం కేటాయింపులు ఉన్నాయి.

ప్ర: ఉపాధి హామీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు ఎన్ని ఉన్నాయి ?

జ: బకాయిలు చాలా వరకు క్లియర్ అయ్యాయి. సిసి రోడ్డు పనులకు సంబంధించి రూ.67 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులోనూ రూ.58 కోట్లు మంజూరయ్యాయి. కూలీలకు సంబంధించి మే నెలాఖరు వరకున్న బకాయిలన్నీ చెల్లించాం. కొత్త సాఫ్టవేర్ స్పర్శకు సైట్ మార్చే క్రమంలో కొంత బకాయిలుండేవి. ఆ ప్రక్రియ పూర్తయినందున ఇక నేరుగా వారి ఖాతాల్లోకి డబ్బులు జమవుతాయి. ఆలస్యం జరిగే అవకాశాలు కూడా చాలా తక్కువగానే ఉండే అవకాశముంది.

ప్ర : ఉపాధి హామీలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జ : ఉపాధి హామీ పథకంపై ఎక్కడ ఆరోపణలొచ్చినా వెంటనే స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఈ ఏడాదిలో నలుగురు సిబ్బందిపై చర్యలు తీసుకున్నాం. కొన్ని చోట్ల పనిచేయని వారికి కూడా వేతనాలు పోతున్నాయన్న ఆరోపణలొస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అరికట్టడం కోసమని వేజ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ ఆకస్మిక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటుంది. ఇక ఈ ఏడాదికి సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తాం. అందులో తప్పు చేసినట్టు తేలితే చర్యలుంటాయి.

ప్ర: ఐడబ్లుఎంఐపి పనులు ఏమి నడుస్తున్నాయి. అవి ఎంత వరకు వచ్చాయి ?

జ : ఐడబ్లుఎంఐపి పనులు పాతవే నడుస్తున్నాయి. 2026 మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో సజ్జలదిన్నె, వెస్ట్ నరసాపురం, హంపాపురం, డీ.కొండాపురం, బూదగవి, ఇప్పేరు ప్రాంతాల్లో ఈపనులు నడుస్తున్నాయి. వాటిని కూడా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిస్థితి ఏమిటి ?

జ : డ్రైల్యాండ్ హార్టీకల్చర్ కింద ఈ ఏడాది ఆరు వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగు చేయాలన్నది లక్ష్యం. ఇందులో జులై ఎనిమిదవ తేదీ ఒక్క రోజే రెండు వేల ఎకరాల్లో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలను ఇప్పటికే రైతులకు మంజూరు చేయడం జరిగింది.

దక్షిణ భారత మహిళా విజేత పురస్కారాన్ని అందుకున్న రాజేశ్వరి



పురస్కారం అందుకుంటున్న రాజేశ్వరి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రముఖ సామాజికవేత్త, కాలమిస్ట్ నల్లాని రాజేశ్వరి ఆదివారం చెన్నైలోని మద్రాస్ క్రిస్టియన్ కళాశాల ఆడిటోరియంలో దక్షిణ భారత మహిళా విజేత-2025 పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. విద్య, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవారంగాల్లో నల్లాని రాజేశ్వరి అందిస్తున్న బహుముఖ సేవలను గుర్తించి అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ తమిళనాడు రాష్ట్ర శాఖ, ట్వల్ మేగజైన్, గ్లోబల్ పింక్ ఆర్మీ సంయుక్త ఆధ్వర్యంలో అవార్డును అందించారు. నల్లానికి ప్రతిష్టాత్మక అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. తన సేవలను గుర్తించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేసిన కమిటీకి రాజేశ్వరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన సర్పంచి తిప్పారెడ్డి

ఉరవకొండ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను విడపనకల్లు మండలం వేల్పుమడుగు సర్పంచు తిప్పారెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఇందులో భాగంగా గ్రామంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పరమేషప్ప, తదితరులు పాల్గొన్నారు.

కాగా మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ఉరవకొండ తాగునీటికి సంబంధించి పిఎబిఆర్‌లో పంప్‌హౌస్‌ను సందర్శించనున్నారు. తర్వాత ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో తాగునీటి పథకం ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు ఎదురుగా ఉన్న ప్రాంతంలో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కోసం స్థల పరిశీలన చేయనున్నారు. తర్వాత నూతనంగా మంజూరైన రాయంపల్లి రోడ్డు, పాల్తూరు రోడ్డు, కనేకల్ క్రాస్ నుంచి ఉరవకొండ టౌన్ రోడ్డుకు భూమిపూజ చేయనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన అపుస్మా నాయకులు

అనంతపురం : కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను జిల్లా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు ముఖ్యంగా పలు నకిలీ విద్యార్థి సంఘాలు తమ పాఠశాలల వద్దకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే నకిలీ ఉపాధ్యాయ సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవిశంకర్‌ప్రసాద్, స్టేట్ కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి ఉన్నారు.

ఘనంగా త్యాగరాజు సంగీత సభ వార్షికోత్సవం

హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



కళాకారులతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీత్యాగరాజు సంగీత సభ 67వ వార్షికోత్సవాన్ని ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ త్యాగరాజు సంగీత సభ అనంతపురంలో అనేక సేవలు అందిస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమంలో తాను పాల్గొనడం చాలా గౌరవంగా ఉందన్నారు. మహానుభావులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ సంగీతానికి అందించిన సేవలు స్మరణీయమైనవి కొనియాడారు. సంగీత వారసత్వాన్ని భవిష్యత్తు తరాలు స్ఫూర్తిగా తీసుకుని అభ్యసించాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, సంగీతం ఆహూతులను అలరించాయి. అనంతరం శ్రీత్యాగరాజు సంగీత సభ సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన బుగ్గయ్యచౌదరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళి, ఆసుపత్రి కమిటీ సభ్యులు నరసింహా, బుగ్గయ్యచౌదరి, కవి ఏలూరి వెంగన్న, రజక సంఘం డైరెక్టర్ పరమేష్, పోస్టల్ యూనియన్ కృష్ణయ్య, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కళాకారులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

సేవా భావంతో ముందుకెళ్లాలి

లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షిరెడ్డి, డాక్టర్ నల్లపాటి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పామిడి

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకెళ్లాలని లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షిరెడ్డి, డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనంతపురం ప్రఖ్యాత దంత వైద్యశాల సౌజన్యంతో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యశాల దంత వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్, డాక్టర్ ఇందు రాధా, డాక్టర్ మోబిసా మెయిన్, డాక్టర్ మురళి, డాక్టర్ శాంతి ప్రియ, గుత్తి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, షేక్ మహబూబ్ బాషా, హనుమేష్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జయరామ్‌రావు, కోశాధికారి షేక్షావలి, డైరెక్టర్ రోషన్ జమీర్, గంగ శేఖర్, కిరణ్, మహేష్, ముండే షేక్షావలి, నరేష్ కుమార్, డెంటల్ హాస్పిటల్ మేనేజర్ అరుణకుమారి, లక్ష్మీ హాస్పిటల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మార్క్ టెస్ట్ విజయవంతం



మార్క్ టెస్ట్ పేపర్లను విడుదల చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బార్ అసోసియేషన్లో నిర్వహించిన మార్క్ టెస్ట్ విజయవంతమైంది. ఈ సందర్భంగా బార్ సోసియేషన్ అధ్యక్షులు పి.గురుప్రసాద్, జనరల్ సెక్రటరీ వెంకటరాముడు మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జికి ప్రిపరేషన్ అవుతున్న జూనియర్ న్యాయవాదులు, విద్యార్థులకు ఈ పరీక్ష ఉపయోగకరంగా ఉంటుందన్నారు. న్యాయవాది సమస్యలు, న్యాయవాదుల వెల్ఫేర్ కోసం ఐలు ఎల్లవేళలా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ధర్మసింగ్‌నాయక్, ట్రెజరర్ రఘు, ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది హరినాథ్‌రెడ్డి, ఐలు గౌరవాధ్యక్షులు సీతారామ్, అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్, సహాయ కార్యదర్శి ఎం.పురుషోత్తం, నాయకులు గిరి, నాయకురాలు భాను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 1979-80లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, కోన విజయ భాస్కర్‌రెడ్డి, నందవరం కేశవరెడ్డి ని పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత ఒకరినొకరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కాగా సినీపాటలు, జానపద గీతాల్లో మంచి పట్టు ఉన్న యాడికి తిప్పారెడ్డిపల్లికి చెందిన సారెడ్డి రామశేఖర్‌రెడ్డి, కొట్టాలపల్లి మల్లారెడ్డి, యాడికి సాధు శేఖర్ ఆలపించిన పాటలు ఆహూతులను అలరించాయి. ఈకార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్‌రఫీ, సుమన్ టీవీ ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి కంచం ప్రభాకర్‌రెడ్డి, సారెడ్డి రామశేఖర్‌రెడ్డి, జనార్ధనస్వామి, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలాన్ని సస్యశ్యామలం చేస్తాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

గడ్డికోట ఎత్తిపోతల పథకం ద్వారా పుట్లూరు మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోనిమె.కొండాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఎన్నికల హామీలు ఇచ్చిన హామీలు లో సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, డిటి మహబూబ్‌బాషా, ట్రాన్స్‌కో సుదర్శన్‌రెడ్డి, ఎంఇఒ శ్రీదేవి, టిడిపి నాయకులు చంద్రదుండు ప్రకాష్ నాయుడు, బాలరంగయ్య, ఎల్కే చెన్నారెడ్డి, చవ్వా, కులశేఖర్‌రెడ్డి, బ్రహ్మయ్య, రామునిరెడ్డి, శివరెడ్డి, శ్రీపతినాయుడు, రవికుమార్, గోవర్ధనరాజు, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాస నాయుడు, సూరేపల్లి వేణు, సచివాలయ సిబ్బంది తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

పెద్దవడుగూరు : తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పెద్దవడుగూరులోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్వామి మూలవిరాట్‌ను అర్చకులు జయరామారావు పూలతో అలంకరించి పంచామృత అభిషేకం, భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణం, పఠించి ప్రత్యేక పూజలు చేశారు.

ఉరవకొండ : ఆషాఢమాసం తొలి ఏకాదశి వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి, పాండురంగస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



గుంతకల్లులో పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఆటో కార్మికులు, ఆశావర్కర్లతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా పట్టణంలోని పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్య పెంచాలని, పని ఒత్తిడి తగ్గించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా మార్పు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వాహన మిత్ర లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కి అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న్ను సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ యూనియన్ నాయకులు ప్రమీల, భాగ్య, విద్యుత్ శాఖ యూనియన్ నాయకులు ఎవికె బాషా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జగదీష్, అంగన్వాడీ నాయకురాలు రేష్మ, ఆటో యూనియన్ నాయకులు మోహన్, కుమార్, సాంబ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సురేష్, వెంకటేశులు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా కార్మిక అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేపట్టినట్లు తెలిపారు.

ఎవరి ఇల్లూ కూల్చరు.. నాదీ బాధ్యత..

విప్ కాలవ శ్రీనివాసులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

'మీ ఇళ్ల జోలికి ఎవరూ రాకుండా చూసుకునే బాధ్యత నాదే' అంటూ విప్ కాలవ శ్రీనివాసులు పట్టణంలోని చంద్రబాబు కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 13వ వార్డు పరిధిలో ఉన్న చంద్రబాబు కాలనీ విప్ సందర్శించారు. ఇందులో భాగంగా ఏడాది కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా అర్హులందరికీ రూ.4వేల పింఛన్, ఏడాదికి ప్రతి కుటుంబానికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు చదువుకుంటున్నా ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.13వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. వీటితోపాటు వైసిపి పాలనలో స్తంభించిన అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి ప్రారంభించామన్నారు. వైకాపా పాలనలో చంద్రబాబు కాలనీవాసులను ఖాళీ చేయించే ఎత్తుగడను తాను దగ్గరుండి తిప్పికొట్టామన్నారు. ఇక్కడ జీవిస్తున్న ఎవరూ భయడాల్సిన భయం లేదన్నారు. మీకు అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. కాలనీ సమీపంలో రైల్వే వంతెన వెళ్తున్నందున కొందరు అనవసర భయాలు సృష్టిస్తున్నారని అలాంటి వదంతులను నమ్మొద్దన్నారు. అధికారులతో తాను మాట్లాడతానని, మరీ అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్తానన్నారు. ఒకవేళ రైల్వే వంతెనకు అడ్డుగా ఏమైనా ఇల్లు ఉంటే ఆ ప్రాంతంలో వారికి మాత్రం అనువైన స్థలాలను ఎంపిక చేసి ఇండ్లు కట్టించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి నాగరాజునాయక్, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, కార్యదర్శి ఇనాయత్, హనుమంతు, పురుషోత్తం, లోకేష్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

'చెట్టు' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

జూటూరు షరీఫ్ రచించిన చెట్టు (వచన శతకం) పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం శాఖ అధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆవిష్కరించారు. పుస్కకాన్ని సీనియర్ కథా నవలా రచయిత శాంతినారాయణ ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖరెడ్డి హాజరయ్యారు.కవి, విర్శకులు, ఉపన్యాసాకులు అంకే శ్రీనివాసులు పుస్తక సమీక్షకుడిగా వ్యవహారించారు. వచన శతకకం వినూత్నమని, వచన శతకం రాసిన వారిలో జూటూరు షరీఫ్ రాయలసీమలో మొదటివాడని శాంతినారాయణ అన్నారు. జూటూరు షరీఫ్ తన కావ్యం ద్వారా ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని నింపాడని రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. పుస్తక సమీక్షకుడు అంకె శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యావరణ కవిత్వంలో జూటూరు షరీఫ్ రచించిన చెట్టు వచన శతకం మైలురాయి వంటిదన్నారు. చెట్టును కేంద్రంగా చేసుకుని ప్రభావశీలంగా, కవితత్మాకంగా వచన శతకం రాయడం అభినందనీయమని స్లాఘించారు. ఈకార్యక్రమంలో తరిమల అమరనాథరెడ్డి, మురళీకృష్ణ భరద్వాజ్, రాయుడు, శ్రీనివాసరెడ్డి, శ్యాంసుందరశాస్త్రి, సూర్యనారాయణరెడ్డి, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, ఆరసం ప్రధాన కార్యదర్శి తన్నీరు నాగేంద్ర, ఇంటాక్ కన్వీనర్ ఆర్.రామ్‌కుమార్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, కొత్తపల్లి సురేష్, జెన్నే ఆనందకుమార్, కృష్ణమూర్తి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, చెట్ల ఈరన్న, శ్రీకాంత్, సౌరపు గోవింద్రాజులు, విశ్వనాథరెడ్డి, గోసల నారాయణస్వామి, వన్నప్ప, రాలింగారెడ్డి, సఫారే రాజశేఖర్, షబ్నం, అల్లాబకాష్, నరసింహం, నూరుల్లా, ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ గ్రామీణ అభివృద్ధి దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బుక్కరాయసముద్రం ఎంపిపి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ గ్రామీణ అభివృద్ధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి సునీతమ్మ మాట్లాడుతూ దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలే అన్నారు. కావున గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమమలో ఎంపిడిఒ సొలమన్‌రాజ్, సర్పంచు పార్వతి, టిడిపి నాయకులు నారాయణస్వామి, పంచాయతీ సెక్రటరీ పెద్ద శ్రీనివాసులు, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ప్రపంచ గ్రామీణ అభివృద్ధి దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహినంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సుప్రియ, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, పరుశురాం, శ్రీనివాసులు, ఎపిఎం తిప్పమ్మ, సీసీలు రామకృష్ణ, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పామిడి గ్రామ పంచాయతీ కార్యాలయలో అంతర్జాతీయ గ్రామీణ అభివృద్ధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజోష్ణ గ్రామాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి అశ్వర్థమనాయుడు, మహిళా సంఘాల మహిళలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

అనంతపురం : అనంతపురం రూరల్ ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచు సావిత్రమ్మ అధ్యక్షతన ఆదివారం అంతర్జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివశంకర్ గ్రామీణ అభివృద్ధిలో పొదుపు సంఘాలు, ఉపాధి హామీ పథకం ఏవిధంగా తోడ్పడిందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు బాలన్న, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ గ్రామీణ అభివృద్ధి దినోత్సవాన్ని ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఎపిడి పుల్లారెడ్డి, సర్పంచు వరలక్ష్మి, ఇఒఆర్‌డి శ్రీదేవి, ఎపిఒ విజయభారతి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఇసి విజయభాస్కర్, సాంకేతిక, క్షేత్రస్థాయి అధికారులు చంద్రానాయక్, విజయలక్ష్మి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

కళ్యాణదుర్గం టౌన్ : మాజీ సైనికుల సంక్షేమం కోసం కృషి చేద్దామని ఆ సంఘం నాయకులు ప్రకటించారు. ఆదివారం కళ్యాణదుర్గంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటిని పొందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చోకారి అమర్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దత్తయ్య, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సలహాదారులు శ్రీనివాసమూర్తి, పలువురు సైనికులు పాల్గొన్నారు.

8న రక్తదాన శిబిరం

కళ్యాణదుర్గం టౌన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు తలారి చరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమన్వయకర్త తలారి రంగయ్య ఆదేశాలతో ఆయన కార్యాలయంలో రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. కావున పార్టీ నాయకులు, అభిమానులు, యువకులు రక్తదానం చేయడానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

వైసిపి నేత మదన్‌మోహన్‌రెడ్డికి నివాళి

అనంతపురం : వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మదన్‌మోహన్‌రెడ్డి మరణం పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం తపోవనంలో పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వెంకటరామిరెడ్డి

యాడికి : మండల మాజీ జడ్పిటిసి వెన్నపూస వెంకటరామిరెడ్డి వైసిపి స్టేట్ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్టట జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా సమస్యలు ఉన్న ప్రజలు, రైతులు సమస్యల పరిష్కార వేదికలో వినతులు సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు.

ఐఒబి నూతన శాఖ ప్రారంభం

అనంతపురం : నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఓవరీస్ బ్యాంకు నారాయణపురం శాఖను చీఫ్ రీజినల్ మేనేజర్ సంజయ్‌కుమార్ ఝూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మరింత చేరువై మెరుగైన సేవలు అందించడంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బండి రమేష్‌గౌడ్, ప్రశాంతిరెడ్డి, రాజకీయ ప్రముఖులు ఎర్రిస్వామిరెడ్డి, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కళ్యాణదుర్గం రూరల్ : దుర్గం ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు కంబాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామంలో ఉన్న రాధాస్వామి సోమ అజాయిబ్ కృపా ఆశ్రమంలో మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 63 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గం ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు కంబాల తిమ్మారెడ్డి, కార్యదర్శి పాటిల్ ఉదయ్ కుమార్‌రెడ్డి, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు కన్నేపల్లి చిత్తప్ప, రాధాస్వామి ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా దిలీప్‌రెడ్డి

అనంతపురం : గుంతకల్లు నియోజకవర్గానికి చెందిన చుక్కలూరు దిలీప్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

గుత్తి : అన్నిరంగాల్లో వెనుకబడ్డ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని వెంకటేశ్వర గుత్తి రజక సంఘం గౌరవాధ్యక్షుడు కె.నాగేంద్ర, మండల అధ్యక్షుడు టి.సురేష్ బాబు కోరారు. ఈ మేరకు రాజమండ్రిలో ఆదివారం జరిగిన రజక ఆకాంక్ష సభలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, రజక ఫెడరేషన్ ఛైర్మన్ సావిత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రజకుల అభివృద్ధికి చేయూతను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర గుత్తి రజక సంఘం నాయకులు వై. కిరణ్ కుమార్, పెద్ద వెంకటేష్,బి.శ్రీనివాసులు, వైసీ.శ్రీనివాసులు,జి. ఆదినారాయణ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల దినోత్సవం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఏరియా పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.శ్రీనివాస గుప్త మాట్లాడుతూ పశుసంక్రమిత వ్యాధులు జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధుల వల్ల చాలా ముప్పు అన్నారు. వీటిపై అవగాహన కల్పించేందుకే ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 48 కుక్కలు, పిల్లులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ కె.రాజశేఖర్, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ మల్లేపల్లి నారాయణ, కళ్యాణదుర్గం పశు వైద్యశాల సిబ్బంది రామమూర్తి, గుల్షాద్ బేగం, వెంకటరమణ, శివకుమార్, ఎన్‌టి చౌదరి, వెటర్నరీ పాలిటెక్నిక్ విద్యార్థులు, పెంపుడు జంతువుల యజమానులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో 58 కుక్కలు, 12 పిల్లులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నగర సమీపంలో ఉన్న శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం శక్తి శారీ బ్యాగ్స్ సహకారంతో ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ దేవరకొండ వారితో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

పేదలకు అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడమాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదర్శనగర్‌లో ఉన్న పుట్టినిల్లు ఆశ్రమం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ పండుగ వేల పేదల ఆకలి తీర్చడం ఆనందంగా ఉందన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టినప్పుడే అసలైన పండుగ రోజు గుర్తొస్తుందని చెప్పారు. వీలున్న ప్రతి ఒక్కరూ పేదలకు, నిస్సహాయులకు అన్నదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ధర్మతేజ, మణిదీప్, లక్ష్మీనారాయణ, లావణ్య, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



అనంతపురంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మేయర్, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమ కోసం అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి, కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, కమల్ భూషణ్, ఇషాక్, రహంతుల్లా, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ నారాయణ నాయక్ మాట్లాడుతూ మహనీయులు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ఎం.ఓబులేసు, కె.వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : స్థానిక అంబేద్కర్ కూడలిలో బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరుల సంక్షేమ సంఘం జిల్లా బాధ్యులు బి.శ్రీనివాసులు, ఆవాజ్ నాయకులు షాషావలి, సిఐటియు నాయకులు జాకీర్ హుస్సేన్, పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు స్టాండ్లీ బాబు, అన్వర్, ఆర్ఎంపి మధు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌డిటి కాలనీలో ఉన్న ఎంఆర్‌పిఎస్ కార్యాలయ ఆవరణలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ, నాయకులు చింతా పురుషోత్తం, మల్లు గళ్ల ఆదిమూర్తి మాదిగ, బాలి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని బళ్లారి మిట్టలో ఉన్న జగజ్జీవన్‌రామ్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహిత చల్లా కిషోర్, మాజీ జడ్పీటీసీ కొల్లాపురి, మల్లిపల్లి సర్పంచు నారాయణ, హాస్టల్ వార్డెన్ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే శారదాంబ సోదరులు ఓబుళరాజు, జర్నలిస్టు లింగప్రసాద్, హిందీ నరసప్ప అల్లుడు నారాయణ, జిల్లా వినియోగదారుల సంఘం గౌరవాధ్యక్షులు చల్లా రాజశేఖర్, ఎంఇఒ తిప్పేస్వామి, వెటర్నరీ మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోయ నాగరాజు, రోజ్లీ రాజేష్, గూబనపల్లి పెద్దన్న, దొడగట్ట నాగరాజు, రఘు జోసెఫ్, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య జయంతి

ఉరవకొండ : ఎరుకల ఆరాధ్య దైవం ఏకలవ్యుని జయంతిని ఉరవకొండలో ఎపి ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నుంచి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ సర్కిల్ వరకూ ఏకలవ్యుని చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఏకలవ్యుని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్, నియోజకవర్గ అధ్యక్షులు సాకే వసంత్, ప్రధాన కార్యదర్శి సాకే పురుషోత్తం, పట్టణ అధ్యక్షులు వీరేంద్ర, నరసింహులు, మహేంద్ర, ఆంజనేయులు, సుబ్బరాయుడు, శేషాద్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : మండల పరిధిలోని ఉప్పవంక గ్రామంలో ఏకలవ్యుని విగ్రహం వద్ద కేక్ కోసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ఎరుకుల సంఘం రాష్ట్ర నాయకులు సాకే పెద్ద ఎర్రిస్వామి, కావడి చంద్ర, మనోజ్, మల్లికార్జున, నాగేంద్ర, రవి, రాజేష్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతిని విజయవంతం చేయండి

నార్పల : ఈనెల 8వ తేదీ మంగళవారం దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

గుత్తి : గుత్తి రైల్వే జంక్షన్ పరిధిలోని మిడుతూరు వంతెన వద్ద ఆదివారం రైల్లో నుంచి ఓ వ్యక్తి కింద పడి మృతిచెందాడు. జిఆర్పి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాదాపు 45ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ తలుపు వద్ద నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మరణించాడు. మృతుని ఎడమ చేతిపై స్వప్న అనే పేరు టాటూ ఉంది. ఘటన స్థలాన్ని జిఆర్పి ఎస్సై నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.